క్లుప్తంగా

క్రీడామైదానం పరిశీలన



సత్యవేడు: బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానాన్ని పరిశీలిస్తున్న అధికారులు

సత్యవేడు: మండలంలో ఈనెల 26 నుంచి జరగనున్న 'ఆడుదాం ఆంధ్రా' క్రీడా పోటీలను విజయవంతం చేయాలని ఎంపీడీఓ చంద్రశేఖర్ కోరారు. మంగళవారం పీఈటీ, పీడీలతో ఆయన మాట్లాడారు. రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ పోటీలను యువతీ యువకులు, విద్యార్థులతో కలిసి విజయవంతం అయ్యేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇప్పటికే గ్రామ కార్యదర్శులు క్రీడాకారుల వివరాలను ఆన్‌లైన్‌లో ఎంపిక చేశారన్నారు. క్రికెట్, కబడ్డీ, వాలీబాల్, బ్యాడ్మింటన్ ఖోఖో టెన్నికాయిట్ వంటి క్రీడా పోటీలు నిర్వహిస్తారన్నారు. గ్రామ సచివాలయాల పరిధిలో నిర్దేశించిన ఆటస్థలాల్లో క్రీడాపోటీలు జరుగుతాయన్నారు. ఇప్పటికే క్రీడా సామగ్రిని గ్రామ సచివాలయాలకు అందజేశామని ఆయన తెలిపారు. సత్యవేడు బాలుర ఉన్నత పాఠశాల, బాలికల ఉన్నత పాఠశాలల క్రీడా మైదానాలను ఎంఈఓ కే.రవి, ఎంఈఓ-2 ఉషా, పీఈటీలతో కలసి ఆయన పరిశీలించారు.

డ్రోన్ వినియోగంపై అవగాహన



డ్రోన్‌పై అవగాహన కల్పిస్తున్న ఏఓ, ఎంపీడీఓ

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని బుచ్చినాయుడుకండ్రిగ గ్రామ రైతులకు ఎంపీడీఓ సాయిలహరి, ఏఓ భారతి మంగళవారం డ్రోన్ వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరి, వేరుశనగ, మిరప ఉద్యానవన పంటలకు ఎకరాకు డ్రోన్ ద్వారా ఐదు నిమిషాల్లో పురుగు మందులను పిచికారీ చేయవచ్చని, తద్వారా రైతులు సమయం, నగదు ఆదా అవుతుందని తెలిపారు. వర్షాలు పడినప్పుడు బురదలో మందులను పిచికారీ చేయడం కష్టతరంగా ఉంటుందన్నారు. డ్రోన్ ద్వారా అయితే సులభంగా పిచికారీ చేయవచ్చన్నారు. ప్రభుత్వం రాయితీపై డ్రోన్‌లను ప్రభుత్వం అందిస్తుందని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అధికారులు, రైతులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

నారాయణవనం: మండలంలో సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం బుధవారం పర్యటిస్తున్నట్లు ఎంపీడీఓ కృష్ణమూర్తి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 9.30 గంటలకు నూతనంగా నిర్మించిన కీళగరం సచివాలయ భవనాన్ని ఎమ్మెల్యే ఆదిమూలం ప్రారంభిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని ఆయన కోరారు.

అంగన్‌వాడీ పిల్లలకు భోజనం



కనమనంబేడు అంగన్‌వాడీ కేంద్రంలో భోజనం తింటున్న పిల్లలు

బుచ్చినాయుడుకండ్రిగ: అంగన్‌వాడీ సిబ్బంది సమ్మె చేస్తుండంతో మండలంలోని కనమనంబేడు గ్రామంలో మంగళవారం వెల్ఫేర్ అసిస్టెంట్ వెంకటసుబ్బయ్య వలంటీర్ల సహాయంతో పిల్లలు, తల్లులకు, గర్భిణులకు భోజనం తయారు చేయించి, పెట్టారు. రుచికరమైన భోజనం పెట్టడంతో చిన్నారులు సంతోషం వ్యక్తం చేశారు.

విద్యార్థినిని ఢీకొన్న స్కూల్ బస్సు

వరదయ్యపాళెం: పాఠశాల ముగించుకుని సైకిల్‌పై వెళ్తున్న విద్యార్థినిని స్కూల్ బస్సు ఢీకొన్న ఘటనలో విద్యార్థిని గాయాల పాలైన ఘటన మండలంలోని కారిపాకం వద్ద చోటు చేసుకుంది. విద్యార్థిని తల్లిదండ్రులు తెలిపిన మేరకు వివరాలు ఇలా.. పులివల్లంకు చెందిన వెట్టి హేమభూషణం కుమార్తె వెట్టి మౌనిక (14) సమీపంలోని కారిపాకం హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతోంది. మంగళవారం సాయంత్రం పాఠశాల సమయం ముగించుకుని పులివల్లంకు సైకిల్‌పై వెళ్తుండగా ఆమెను తప్పించబోయిన ఓ ప్రైవేటు స్కూల్ బస్సు ఢీకొంది. ప్రమాదంలో మౌనిక కాలు విరిగినట్లు ఆమె తల్లిదండ్రులు తెలిపారు. చికిత్స నిమిత్తం సూళ్లూరుపేటకు తరలించి వైద్యం చేపడుతున్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ



సరుకులు అందజేస్తున్న ఫిన్‌కేర్ బ్యాంకు సిబ్బంది

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి మండలంలోని పలు గ్రామాల్లో వరద బాధితులకు మంగళవారం ఫిన్‌కేర్ బ్యాంకు ఆధ్వర్యంలో రూ.500 విలువ చేసే నిత్యావసర సరుకులను అందజేశారు. సుమారు 300మందికి అందజేశారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ రీజనల్ మేనేజరు శేషాద్రి, డీజీఎం వెంకటస్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

వైకుంఠ ఏకాదశికి సర్వం సిద్ధం

- భక్తులకు ఇబ్బందులు లేకుండా క్యూలైన్లు
- ఏర్పాట్లను పర్యవేక్షించిన ఆలయ అధికారి నాగరాజు



వెంకన్న ఆలయంలో ఏర్పాటు చేస్తున్న క్యూలైన్లు

నారాయణవనం: పద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 23వ తేదీ శనివారం వైకుంఠ ఏకాదశి సందర్భంగా ప్రత్యేక ఏర్పాట్లను చేపట్టారు. ఆలయంలో శనివారం వైకుంఠ ఏకాదశి ఉత్సవాన్ని, ఆదివారం ద్వాదశి ప్రవేశ ఉత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ అధికారి నాగరాజు తెలిపారు. భక్తులు ఇబ్బందులు పడకుండా మూడు క్యూలైన్లను ఏర్పాటు చేశామని అన్నారు. ఉచిత, రూ.20 ప్రత్యేక క్యూలైన్లతో పాటు వీఐపీలు, టీటీడీ ఉద్యోగుల కోసం మరో క్యూలైన్‌ను ఏర్పాటు చేశామని తెలిపారు. శనివారం సాయంత్రం ఏకాదశి సందర్భంగా ఉభయ నాంచారులతో కల్యాణ వెంకన్న గ్రామోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను నిరంతరం అందించడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు.

ఆదివారం ద్వార ప్రవేశం..

వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని పద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ద్వాదశి రోజున భక్తులను ఉత్తరముఖ ద్వార ప్రవేశానికి అనుమతిస్తామని ఆలయ అధికారి నాగరాజు, ప్రధాన అర్చకులు శ్రీధరభట్టాచార్య తెలిపారు. వైష్ణవ ఆలయాలలో వైకుంఠ ఏకాదశి రోజున ఉత్తర ముఖ ద్వారంలో భక్తులను అనుమతిస్తే, నారాయణవనంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో ద్వాదశి రోజున ద్వార ప్రవేశ ఉత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆదివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఆలయంలోని ఉత్తర ముఖ ద్వారంలో భక్తులకు కల్యాణ వెంకన్న స్వామి దర్శనమిస్తారని తెలిపారు. భక్తులందరికీ ద్వార ప్రవేశం కల్పిస్తామన్నారు.

సిపాయి భరోసా అందజేత



బాధిత కుటుంబానికి నిత్యావసర సరకులు అందజేస్తున్న ఎమ్మెల్సీ సిపాయి

ఏర్పేడు: మండలంలోని ఇసుకతాగేలి గ్రామానికి చెందిన లక్ష్మయ్య(25) ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. మంగళవారం తిరుపతి రష్ ఆస్పత్రి అధినేత, ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం ఇసుకతాగేలి గ్రామానికి వెళ్లి 'సిపాయి భరోసా' కింద కుటుంబానికి ఏడాదికి సరిపడా 40 రకాల నిత్యావసర సరకులను అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గురవమ్మ, వైస్ సర్పంచ్ వనజాక్షి, ఎంపీటీసీ కృష్ణవేణి, మాజీ ఎంపీటీసీ చెంబేటి మునిరత్నంరెడ్డి, డాక్టర్ బాబు, వైఎస్సార్ సీపీ మండల అధికార ప్రతినిధులు కందాటి ప్రభాకర్‌రెడ్డి, మునికృష్ణారెడ్డి, నాయకులు దశరథరామిరెడ్డి, దామోధరంరెడ్డి, బాలకృష్ణారెడ్డి, మునిరెడ్డి, సుబ్రమణ్యంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఏడు గంగమ్మల ఆలయ పరిశీలన



సూచనలు ఇస్తున్న అంజూరు తారక శ్రీనివాసులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పట్టణంలోని ఏడుగంగమ్మల ఆలయాన్ని మంగళవారం శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధ ఆలయమైన ఏడుగంగమ్మల ఆలయ పునర్నిర్మాణానికి రూ.39 లక్షలు నిధులతో టెండర్లు పిలిచి వర్క్ ఆర్డర్ ఇచ్చినట్లు తెలిపారు. అయితే జాతర కారణంగా పనులు నిలుపుదల చేయాల్సి వచ్చిందని తెలిపారు. జాతర ముగియడంతో ఆలయ ఇంజినీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్లు కలసి పునర్నిర్మాణ పనులు చేపట్టామన్నారు. పనులు వేగవంతం చేయాలని అధికారులకు ఆయన సూచించారు. కార్యక్రమంలో ఆలయ ఇంజనీరింగ్‌శాఖ అధికారులు ఏఈ వేణుగోపాల్‌రెడ్డి, వర్క్ ఇన్‌స్పెక్టర్ సూర్యప్రసాద్, స్థపతి కుమార్, కాంట్రాక్టరు భాస్కర్‌రెడ్డి, భాస్కర్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

శివనామ సంకీర్తనలకు అవకాశం కల్పించండి



మాట్లాడుతున్న విజయశంకరస్వాములు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరస్వామి సన్నిధిలో అఖండ శివనామ సంకీర్తనలకు అవకాశం కల్పించాలని అన్నమయ్య జానపద కళాక్షేత్రం పీఠాధిపతి విజయశంకర స్వాములు అన్నారు. మంగళవారం దక్కిలిలో దీనిపై సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరి 4వతేదీన శ్రీకాళహస్తీశ్వరాలయ ఈఓను కలిసి వినతిపత్రం ఇవ్వనున్న ట్లు తెలిపారు. కార్యక్రమంలో సంక్రాంతి వెంకటయ్య, సుధాకర్, పోలయ్య, నరసయ్య, పుల్లయ్య, వెంకటేశ్వర్లు, రమణమ్మ, వెంకటమమ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతులకు నష్ట పరిహారం పంపిణీ



పరిహారం చెక్కు అందుకుంటున్న రాచర్లకు చెందిన పాడిరైతు శైలజ

వరదయ్యపాళెం: మిచాంగ్ తుపాన్ కారణంగా కురిసిన భారీ వర్షాలకు మృతి చెందిన పాడి పశువులకు, మేకలు, గొర్రెలకు సంబంధించి నష్ట పరిహారాన్ని ప్రభుత్వం అందజేసింది. ఆ మేరకు మండలంలో మృతి చెందిన పశువులకు సంబంధించి మంగళవారం వరదయ్యపాళెం పశువుల ఆస్పత్రిలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా పశువైద్యాధికారి రవికుమార్ చేతుల మీదుగా రాచర్లకు చెందిన పాడిరైతు ఆర్.శైలజ, చిన్నపాండూరుకు చెందిన టి.భాస్కర్, పెద్దపాండూరుకు చెందిన ఎస్‌కే మాబూకు రూ.37,500 చొప్పున ఒక్కో రైతుకు నగదు చెక్కును అందజేశారు. అలాగే సంతవేలూరులో మృతి చెందిన గొర్రెలకు సంబంధించి ఏ.సుబ్రమణ్యం, రమేష్‌కు రూ.4 వేలు చొప్పున పంపిణీ చేశారు. బాధిత రైతులు మాట్లాడుతూ రాష్ట్రచరిత్రలో తుపాన్‌లలో పశువులు మృతి చెందితే ఇంత వేగంగా పెద్దమొత్తంలో పరిహారం అందుకోవడం ముఖ్యమంత్రి జగనన్న ప్రభుత్వంలోనే అని ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి గౌరి, సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత క్యాన్సర్ వైద్యశిబిరానికి స్పందన

శ్రీకాళహస్తి: రాష్ట్రీయ సేవాసమితి, టాటాట్రస్టు ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని కొత్తపేటలో ఉచిత క్యాన్సర్ వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా సబ్ మేనేజరు మాట్లాడుతూ రాస్ పొదుపు సంఘాల సభ్యులకు ఆర్థిక క్రమశిక్షణతో పాటు ఎన్నోరకాలుగా సభ్యులకు వారి కుటుంబ సభ్యులకు విరివిగా ఆర్థికేతర కార్యక్రమాలు నిర్వహించడం సంతోషకరమన్నారు. రాస్ కల్పిస్తున్న ఇలాంటి వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ఈ వైద్యశిబిరంలో మహిళలు, పురుషులకు రక్తపోటు, మధుమేహం, హైపటైటిస్ బిఅండ్‌సీ, నోటి క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్లకు సంబంధించి అన్ని పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. కార్యక్రమంలో టాటా ట్రస్టు బృందం రెడ్డి కుమారి, మెహతాజ్, అమరావతి, అర్చన, రాస్ సిబ్బంది వెంకటేష్, వినోద్, సుబ్బారావు పాల్గొన్నారు.

తుపాన్ బాధితులకు నగదు అందజేత



నగదును అందజేస్తున్న గున్నేరి కిషోర్‌రెడ్డి

ఏర్పేడు: స్థానిక పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో మిచాంగ్ తుపాన్ బాధితులకు వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్‌రెడ్డి మంగళవారం నగదును అందజేశారు. పంచాయతీ పరిధిలోని అశోక్ నగర్, ఎస్టీ కాలనీ, పల్లి, యాదవ, గాండ్ల, బజారు వీధులకు చెందిన 140 కుటుంబాలకు రూ.2.84 లక్షలు నగదును అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు నల్లపాలెం శివయ్య, శేఖర్‌రాజు, ప్రభావతి, వీఆర్వోలు ప్రభాకర్‌రెడ్డి, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో పన్ను వసూలు చేయండి



బుచ్చినాయుడుకండ్రిగ నగదు రహిత ఇంటి పన్ను వసూలు చేస్తున్న అధికారులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని 28 పంచాయతీలలో సకాలంలో ఇంటి పన్నులు వసూలు చేయాలని సూళ్లూరుపేట డివిజనల్ పంచాయతీ అధికారి రవీంద్రబాబు తెలిపారు. ఆయన మంగళవారం బుచ్చినాయుడుకండ్రిగ గ్రామ సచివాలయంలో కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. పంచాయతీల్లో పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, వీధిలైట్లు నిర్వహణపై దృష్టి పెట్టాలని తెలిపారు. ఇళ్ల నుంచి సేకరించిన చెత్తను సంపద కేంద్రాలకు తరలించి ఎరువులు తయారు చేసి ఆదాయం పొందేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం బుచ్చినాయుడుకండ్రిగ గ్రామంలో నగదు రహిత ఇంటి పన్ను వసూలు చేసి, సిబ్బందికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి ఇందిరమ్మ, ఉప సర్పంచ్ మునిరాజా, వెల్ఫేర్ అసిస్టెంట్ వెంకటసుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యశాఖ టాస్క్‌ఫోర్స్ బృందం తనిఖీలు



సిబ్బందితో జిల్లా ఆరోగ్యశాఖ టాస్క్‌ఫోర్స్ బృందం

తొట్టంబేడు (శ్రీకాళహస్తి) : జిల్లా ఆరోగ్యశాఖ టాస్క్‌ఫోర్స్ బృందం సభ్యులు మంగళవారం తొట్టంబేడు-2 సచివాలయం పరిధిలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. డీపీఎంఓ డాక్టర్ శ్రీనివాసరావు సారథ్యంలో జిల్లా గణాంకాధికారి నాగేంద్రకుమార్, డీపీహెచ్ఎన్ఓ బేబిరాణి, డీపీఓ ప్రకాష్‌తో కూడిన బృందం సచివాలయం పరిధిలో గర్భిణుల ఎంసీపీ కార్డులు, చిన్నపిల్లలకు టీకాల నమోదు రికార్డులను పరిశీలించారు. రక్తహీనతతో ఉన్న గర్భిణులు, 19 ఏళ్లలోపు వయసు కలిగిన పిల్లలను గుర్తించి సచివాలయంలో హెచ్‌బీ పరీక్షలు నిర్వహించి సరిపోల్చి చూశారు. కార్యక్రమంలో తొట్టంబేడు పీహెచ్‌సీ వైద్యులు సాయిపూజ, పీహెచ్ఎన్ సంపూర్ణ, సీహెచ్ఓ రత్నాకర్, హెచ్ఎస్ ధనమ్మ, ఎంఎల్‌హెచ్‌పీ భారతి, ఏఎన్ఎం సుధ, ఆశాకార్యకర్త మంజుల పాల్గొన్నారు.

నిత్యాన్నదాన పథకానికి రూ.50 వేలు విరాళం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకనికి బగల్‌కోట్‌కు చెందిన నాగరాజ్ కులకర్ణి, చిన్మయి మంగళవారం రూ.50వేలు విరాళంగా అందించారు. ఈ సొమ్మును ఆలయ సహాయ కమిషనర్ మల్లికార్జునప్రసాద్ స్వీకరించి దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. స్వామి, అమ్మవార్ల దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం గురు దక్షిణామూర్తి సన్నిధిలో ఆలయ వేదపండితులు వారిని ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు పాల్గొన్నారు.

శివయ్య భూమి ఒక్క అడుగు కూడా మాకొద్దు



పత్రాలను చూపుతున్న భూయజమానులు



భూమికి సంబంధించిన పత్రాలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరస్వామి భూమి ఒక్క అడుగు కూడా మాకొద్దు అని జయసుధ అనే బాధితురాలు స్పష్టం చేశారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ శ్రీకాళహస్తి పట్టణంలోని నీలకంఠేశ్వరస్వామి ఆలయం వద్ద సర్వే నం.327/3లో నివాసం ఉంటున్న ఇల్లు, భూమి తమ తాత, ముత్తాల నుంచి సంక్రమించిందన్నారు. పురాతన కాలం నాటి ఇంటిని పునర్నిర్మించాలనే ఉద్దేశంతో తమ భూమిని చదును చేస్తుంటే కొంతమంది ఆ స్థలం ఆలయానికి చెందిందని, కబ్జా చేస్తున్నారంటూ నిందలు మోపడం బాధాకరమన్నారు. దేవునికి సంబంధించిన స్థలాలను కబ్జా చేయాల్సిన అవసరం తమకు లేదన్నారు. ఆలయ అధికారులు సర్వే చేపట్టి వారికి సంబంధించిన భూమి ఉంటే తీసుకోవడానికి ఎలాంటి ఆక్షేపణ లేదన్నారు.

ప్రయోగాలతో మేధోశక్తి పెంపు



ప్రయోగాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

బుచ్చినాయుడుకండ్రిగ: ప్రయోగాలు చేయడం ద్వారా విద్యార్థులలో మేధస్సు పెరుగుతుందని మండల విద్యాశాఖాధికారులు రవీంద్రనాథ్, మునిసుబ్రమణ్యం తెలిపారు. మంగళవారం మండలకేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో సౌత్ ఇండియా సైన్స్ ఫేర్-2024 విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనను వారు ప్రారంభించారు. ఉపాధ్యాయులు విద్యార్థులతో సైన్స్ ప్రయోగాలను చేయించారు. ప్రయోగాలు చేయడం ద్వారా విద్యార్థులకు సైన్స్‌పై అవగాహన, ఆసక్తి కలుగుతుందన్నారు. కొత్త సైన్స్ పుస్తకాల్లోని పాఠ్యాంశాల ఆధారంగా ప్రయోగాలు చేసినట్లు ఉపాధ్యాయులు తెలిపారు. విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలని, వర్కింగ్ మోడల్స్‌కి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అనంతరం విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రమణయ్య పాల్గొన్నారు.

సృజనాత్మకతను పెంచేలా సైన్స్ ఫేర్

సత్యవేడు: విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనలు విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంచి, శాస్త్ర, సాంకేతిక రంగాల వైపు పట్టు సాధించేందుకు దోహదపడతాయని ఎంఈఓ కే.రవి అన్నారు. మంగళవారం స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం జరిగిన విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. మండలస్థాయిలో 11 ఉన్నత పాఠశాలలు, 5 యూపీ స్కూల్‌కు చెందిన 59 మంది విద్యార్థులు ప్రదర్శనలను చేపట్టారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులకు గురుకుల బాలుర ఉన్నతపాఠశాల, సత్యవేడు బాలికల ఉన్నత పాఠశాల, పుదుకుప్పం తమిళ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. ఎంఈఓ-2 ఉష, హెచ్‌ఎం భారతి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం కావాలంటే జగనన్న రావాలి



పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న పార్టీ శ్రేణులు



పాదయాత్ర చేస్తున్న గాలి గణేష్ బృందం

గంగాధర నెల్లూరు: సీఎం జగనన్న నవరత్నాల హామీలను 99 శాతం నెరవేర్చారని జేసీఎస్ కన్వీనర్ వెంకటేష్ రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని కొత్త వెంకటాపురం గ్రామ సచివాలయంలో మంగళవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని ఈఓపీఆర్డీ రాఘవేంద్ర రాజు ప్రారంభించారు. కొత్త వెంకటాపురం పంచాయతీలో అభివృద్ధి, సంక్షేమ పథకాల కోసం రూ.20 కోట్లు వెచ్చించారని తెలిపారు. అనంతరం సచివాలయంలో సంక్షేమ పథకాల ద్వారా ఎంత లబ్ధి పొందారో తెలుసుకోవడానికి డిస్‌ప్లే బోర్డు ఆవిష్కరించారు. అనంతరం గ్రామంలో పార్టీ జెండా ఎగుర వేశారు. కార్యక్రమంలో నాయకులు సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లు, అధికారులు పాల్గొన్నారు.

జగనన్నను మరోసారి సీఎంను చేసుకుందాం

కేవీబీపురం: ఎన్నికల ముందు మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ రాష్ట్ర ముఖ్యమంత్రిగా చేసుకోవాలని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గవర్ల కృష్ణయ్య అన్నారు. మండలంలోని సదాశివాపురం సచివాలయంలో మంగళవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సంక్షేమ పథకాల ద్వారా రాష్ట్రంలోని ప్రతి కుటుంబంలో కొత్త వెలుగులు వచ్చాయన్నారు. కార్యక్రమంలో భాగంగా పథకాల డిజిటల్ బోర్డును ఆవిష్కరించి, ప్రధాన కూడలిలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ రామ్మోహన్ వర్మ, వైస్ ఎంపీపీ శ్రీనివాస్ యాదవ్, ముఖ్యనేతలు, ఎంపీడీఓ రామచంద్ర, సచివాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమం కావాలంటే జగనన్న రావాలి

ఏర్పేడు: సుపరిపాలన అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుందామని వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్ రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని పంగూరులో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం జరిగింది. ముందు జెండా ఆవిష్కరణ చేసి వివిధ అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల వివరాలు తెలిపే బోర్డును ప్రారంభించారు. ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలపై చేకూరిన లబ్ధిని గ్రామస్తులకు వివరించి కరపత్రాలు అందజేశారు. అనంతరం రాత్రి పల్లెనిద్ర చేశారు.

మళ్లీ జగన్ సీఎం కావాలని కాంక్షిస్తూ..

ఏర్పేడు: మళ్లీ వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి సీఎం కావాలన్న సంకల్పంతో విశాఖపట్నం నుంచి తిరుమలకు పాదయాత్ర చేస్తున్న వైఎస్సార్ అమరజ్యోతి స్టూడెంట్స్ అండ్ యూత్ ఫోర్స్ అధ్యక్షుడు గాలి గణేష్ బృందం సోమవారం రాత్రికి ఏర్పేడుకు చేరుకుంది. మంగళవారం ఉదయం తిరుమలకు బయలుదేరింది. విశాఖపట్నం జిల్లా రావికమతం మండలం జెడ్.కొత్తపట్నంకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు గాలి గణేష్ తమ బృందంతో నవంబరు 30వ తేదీ బయలుదేరారు.

నిరంతర సాధనతో అద్భుతాల సృష్టి



కిరణ్ బేడికి జ్ఞాపిక అందిస్తున్న డాక్టర్ రమాదేవి

రేణిగుంట: మహిళలు ఆధునిక జీవనశైలిలో దృఢ సంకల్పం కోల్పోకుండా నిరంతర సాధన చేసి అనుకున్న లక్ష్యాలకు చేరుకోవాలని మాజీ లెఫ్టినెంట్ గవర్నర్ కిరణ్‌బేడీ పిలుపునిచ్చారు. సీఐఐ-ఇండియన్ ఉమెన్ నెట్‌వర్క్ ఆధ్వర్యంలో రేణిగుంట మండలం కరకంబాడి అమరరాజ లేక్‌వ్యూ అతిథి గృహంలో మంగళవారం సాయంత్రం జరిగిన మీట్ అండ్ గ్రీట్ ఈవెంట్లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ముందున్నారని, తమ పాత్ర ప్రధానమని సమాజానికి తెలియజేస్తున్నట్లు వివరించారు. ఎలాంటి విపత్కర పరిస్థితుల్లోనూ మనోనిబ్బరం కోల్పోకుండా ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. ఆమెను అమర ఆస్పత్రి ఎండీ డాక్టర్ రమాదేవి గౌరినేని శాలువాతో ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేశారు.

శ్రీకాళహస్తి వెళ్తుండగా..





క్షతగాత్రులను ఆస్పత్రికి తరలిస్తున్న సిబ్బంది

తొట్టంబేడు (శ్రీకాళహస్తి): రెండు వాహనాలు ఢీకొన్న ఘటనలో ఐదుగురు వ్యక్తులు గాయపడిన నాయుడుపేట-పూతలపట్టు ప్రధాన రహదారిలోని లింగమనాయడుపల్లి సమీపంలో సోమవారం రాత్రి జరిగింది. తొట్టంబేడు ఎస్ఐ రాఘవేంద్ర కథనం మేరకు.. తెలంగాణ రాష్ట్రం నల్గొండ జిల్లా దేవరకొండకు చెందిన సైదులు(36) సాక్షి రిపోర్టర్‌గా పని చేస్తున్నాడు. ఇతను కుటుంబ సభ్యులతో కలిసి శ్రీకాళహస్తీశ్వరస్వామివారి దర్శనానికి శ్రీకాళహస్తి వస్తుండగా లింగమనాయుడుపల్లి సమీపానికి చేరుకోగానే ఎదురుగా వేగంగా వెళ్తున్న ఓ లారీ వీరి క్వాలిస్ వాహనాన్ని ఢీకొని ఆపకుండా వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో క్వాలిస్ వాహనం కొంతభాగం ధ్వంసం కాగా అందులో ఉన్న భార్గవి(28) అనే మహిళ తీవ్రంగా గాయపడింది. డ్రైవర్ సహా మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన సైదులు, భార్గవిని చికిత్స నిమిత్తం తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సేవా కార్యక్రమాలు చేపట్టండి



కోనేటి ఆదిమూలం, ఎమ్మెల్యే, సత్యవేడు

పిచ్చాటూరు: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని పార్టీ శ్రేణులు విస్తృతంగా సేవాకార్యక్రమాలు చేపట్టాలని ఎమ్మెల్యే ఆదిమూలం పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి జన్మదిన వేడుకల్లో ప్రధానంగా కేక్ కటింగ్, మొక్కలు నాటడం, పేదలకు అన్నదానం, రక్తదానంతో పాటు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించేలా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. అన్ని మండల కేంద్రాలు, గ్రామాల్లో సీఎం జగనన్న జన్మదినాన్ని పండుగ వాతావరణంలో జరపాలని పార్టీ శ్రేణులకు ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులు, జగనన్న అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఆటో బోల్తా.. ఒకరి మృతి

తొట్టంబేడు (శ్రీకాళహస్తి) : ఆటో బోల్తాపడిన ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన ఏర్పేడు-వెంకటగిరి ప్రధాన రహదారి శ్రీకాళహస్తి మండలం అమ్మచెరువు సమీపంలో మంగళవారం జరిగింది. శ్రీకాళహస్తి రూరల్ సీఐ అజయ్‌కుమార్ కథనం మేరకు బాలాయపల్లి మండలం మల్లెమాలకు చెందిన వ్యవసాయ కూలీలు ఆటోలో శ్రీకాళహస్తి మండలంలో వరినాట్లు వేసే పనిపూర్తి చేసుకుని తిరిగి ఆటోలో స్వగ్రామానికి వెళుతున్నారు. ఆటో వేగంగా వెళుతూ అమ్మచెరువు సమీపంలో బోల్తాపడింది. ఈ ఘటనలో పెంచలయ్య(53) తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు. మరో ఇద్దరికి స్వల్పగాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.